# బలగం BALAGAM TV

BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com

హైదరాబాద్ ఆదివారం 27 ఏప్రిల్ 2025 | www.balagamtv.com | పేజీలు 4




## వందలాది గుడిసెలు దగ్ధం

- రంగారెడ్డి జిల్లా కుంట్లూరులో అగ్నిప్రమాదం
- మంటల్లో సిలిండర్లు తోడవడంతో ఎగిసిపడిన అగ్ని కిలలు
- బూడిదైన సర్టిఫికెట్స్, డబ్బులు

వివరాలు 2వ పేజీలో

# గులాబీ పండుగకు సర్వం సిద్ధం



- నేడే వరంగల్‌లో బీఆర్ఎస్ రజతోత్సవ సభ
- 1,213 ఎకరాల్లో రజతోత్సవ సభ ఏర్పాట్లు
- 154 ఎకరాల్లో మహాసభ ప్రాంగణం
- 500 మంది కూర్చునేలా ప్రధాన వేదిక
- 1,059 ఎకరాల్లో పార్కింగ్ ఏర్పాట్లు
- వివిధ రూట్లలో 6 అంబులెన్స్‌లు
- పరిసరాల్లో 12 వైద్యశిబిరాలు
- పార్కింగ్ నిర్వహణకు 2,000 మంది వాలంటీర్లు

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

తెలంగాణ రాష్ట్ర సాధనే లక్ష్యంగా పురుడు పోసుకున్న బీఆర్ఎస్ కు 25 సంవత్సరాలు నిండాయి. 2001లో ఏర్పడి 2014లో రాష్ట్రాన్ని సాధించే దాకా పుట్టినగడ్డ విముక్తి కోసం లెక్కలేనన్ని పోరాటాలు చేసిన బీఆర్ఎస్, అధికారంలోకి వచ్చిన తరువాత పదేండ్ల పాటు సుపరిపాలన అందించి దేశంలోనే నెంబర్ వన్ రాష్ట్రంగా తెలంగాణను నిలిపింది. 17 నెలల క్రితం రాష్ట్ర అసెంబ్లీకి జరిగిన ఎన్నికల్లో కేవలం 2.05% ఓట్ల తేడాతో అధికారం కోల్పోయిన బీఆర్ఎస్, స్వల్ప కాలంలోనే ప్రభుత్వ వైఫల్యాలపై అలుపెరగని పోరాటం చేస్తున్నది. తెలంగాణ ప్రయోజనాలే పరమావధిగా పదిహేడు నెలల నుంచి అద్భుతంగా ప్రతిపక్ష పాత్ర పోషిస్తుంది.

లగచర్లలో గిరిజన రైతులపై దాష్టికాలను యావత్ దేశం దృష్టికి తీసుకుపోవడంలో బీఆర్ఎస్ విజయవంతం అయింది. మూసీ, హైడ్రా బాధితులకు అండగా నిలబడింది. మొన్నటి హెచ్.సి.యూ విద్యార్థుల పోరాటానికి వెన్నుదన్నుగా నిలిచింది. ఇప్పుడు 25 ఏండ్ల రజతోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు బీఆర్ఎస్ రెడీ అయింది.

తెలంగాణ రాష్ట్ర సాధనే ఏకైక లక్ష్యంగా 2001 ఏప్రిల్ 27న ఏర్పడిన తెలంగాణ ప్రజల ఇంటిపార్టీ బీఆర్ఎస్ 25 ఏండ్ల పండుగను చరిత్రలో నిలిచిపోయేలా నిర్వహించబోతున్నారు. లక్షలాదిగా తరలివచ్చే జనానికి అందుకు తగ్గట్టుగానే తాత్కాలిక వసతి సౌకర్యాలు సిద్ధమయ్యాయి. హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి రైతులు స్వచ్ఛందంగా ఇచ్చిన 1,213 ఎకరాల్లో రజతోత్సవ సభ కోసం బీఆర్ఎస్ పార్టీ ఘనంగా ఏర్పాట్లు చేసింది. మహాసభ ప్రాంగణాన్ని 154 ఎకరాల్లో సిద్ధం చేసింది. 500 మంది కూర్చునేలా గులాబీ రంగులతో వేదికను తీర్చిదిద్దారు. వేదిక పక్కనే కళాకారుల ఆట–పాట కోసం ప్రత్యేకంగా మరో స్టేజ్ ను ఏర్పాటుచేశారు. ఇక ఎల్కతుర్తికి వచ్చే అన్ని రోడ్డు మార్గాల్లో చెత్తను, ముండ్ల చెట్లను తొలగించి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చేశారు. ప్రతి రోడ్డుకు ఇరువైపులా మొరం పోసి చదును చేశారు.

ఇక సభకోసం రాష్ట్రంలోని నలుమూలల నుంచి దాదాపు 50 వేల వాహనాల వస్తాయని అంచనా వేస్తున్నారు. పార్కింగ్ కోసం 1,059 ఎకరాలను కేటాయించారు. వీఐపీ వాహనాల కోసం సభావేదిక ఎడమ భాగం, వెనుక భాగంలో పార్కింగ్‌ను ఏర్పాటుచేశారు. సభకు వచ్చే ప్రజల కోసం లక్షకుపైగా కుర్చీలను ఏర్పాటు వేశారు. మహిళల కోసం ప్రత్యేక కుర్చీలు వేసి బారికేడ్లు పెట్టారు. లైట్లు, ఎల్ఈడీల కోసం 200 భారీ జనరేటర్లను ఏర్పాటుచేశారు. కేసీఆర్ అందరికీ స్పష్టంగా కనిపించేలా 20/50 సైజుతో కూడిన 23 ఎల్ఈడీ భారీ స్క్రీన్లు, భారీ సౌండ్ సిస్టంను చుట్టుపక్కల ఏర్పాటుచేశారు.

### మరికొన్ని ఏర్పాట్లు

6 అంబులెన్సులు, 12 వైద్య శిబిరాలు
1,200 టెంపరరీ మరుగుదొడ్ల ఏర్పాటు
10 లక్షల వాటర్ బాటిళ్లు
16 లక్షల మజ్జిగ ప్యాకెట్లు
పార్కింగ్ నిర్వహణకు 2,000 మంది వలంటీర్లు

మిగితా 2వ పేజీలో

# రాజకీయాల్లోకి కొత్తతరం రావాలి

- అప్పుడే కొత్త ఆలోచనలు పుట్టుకొచ్చి దేశం అభివృద్ధి పథంలో దూసుకుపోతుంది
- పదేళ్లలో ప్రపంచ రాజకీయాలు మారిపోయాయి
- ప్రతిపక్షాలకు చట్టసభల్లో మాట్లాడే అవకాశం లేకుండాపోయింది
- ప్రపంచ వ్యాప్తంగా అణచివేత కొనసాగుతోంది
- ప్రజలతో ఎలా మాట్లాడాలో భారత్ జోడో యాత్ర నేర్పింది
- భారత్ సమ్మిట్‌లో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ






**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

రాజకీయాల్లోకి కొత్తతరం రావాలని లోక్‌సభలో ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ ఆకాంక్షించారు. అప్పుడే కొత్త ఆలోచనలు పుట్టుకొచ్చి, దేశం అభివృద్ధి పథంలో దూసుకుపోతుందని అన్నారు. హైదరాబాద్‌లోని హెచ్ఐసీసీలో భారత్ సమ్మిట్‌లో ఆయన మాట్లాడారు. తాను నిన్ననే రావాల్సి ఉన్నా, కశ్మీర్‌కు వెళ్లడం వల్ల రాలేకపోయానని, అందుకు క్షమించాలని కోరారు. ప్రపంచ వ్యాప్తంగా రాజకీయాలు ఎంతో మారిపోయాయి. పదేళ్ల క్రితం నాటి పరిస్థితులు ఇప్పుడు లేవు. విపక్షాలను అణగదొక్కడమే అధికార పార్టీకి పనైపోయింది. మీడియా స్వేచ్ఛకు సంకెళ్లు వేశారు' అంటూ మండిపడ్డారు. ఈ సందర్భంగా ఎన్నికలకు ముందు కన్యాకుమారి నుంచి సుమారు 4 వేల కిలోమీటర్లు పాదయాత్ర చేసినట్లు రాహుల్ గుర్తు చేసుకున్నారు. పాదయాత్రకు ముందు చాలా ఆలోచించానని, అయితే, మొదలు పెట్టిన తర్వాత వెనకడుగు వేయలేదని అన్నారు. ఆ తర్వాత చాలా మంది తనతో కలిసి నడవడం మొదలు పెట్టినట్లు చెప్పారు. 'నేను రాజకీయాల్లోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు ప్రజల మాటలు వినడం కంటే మాట్లాడటానికే ప్రాధాన్యత ఇచ్చాను. కానీ యాత్ర సమయంలో అసలైన 'వినడం' అంటే ఏమిటో నేర్చుకున్నాను. యాత్రలో ప్రజలతో మమేకమై వారి సమస్యలను, భావాలను లోతుగా అర్థం చేసుకునే ప్రయత్నం చేశా. యాత్ర ప్రారంభంలో నా మనసులో సంభాషణలు కొనసాగుతూ ఉండేవి.

క్రమేణా అవి నిశ్శబ్దంగా మారి ఎదుటివారు చెప్పేది మాత్రమే వినడం అలవాటైంది. ఈ క్రమంలో ఒక మహిళ నన్ను కలిసి తన భర్త తనను కొడుతున్నాడని చెప్పింది. ఆమె ఆ విషయం నాకు చెప్పడానికి మాత్రమే వచ్చింది. ఆమె బాధను నేను విన్న తర్వాత, ఆమెలో భయం పోయి ప్రశాంతత కనిపించింది. కేవలం వినడం ద్వారానే ఎంతో మార్పు తీసుకురావచ్చని గ్రహించాను. ప్రజలు చెప్పేది వినడం అనేది ఎంతో ముఖ్యం.' అని అన్నారు.

రాజకీయాల్లో తమ ప్రత్యర్థులు కోపం, ద్వేషంపై గుత్తాధిపత్యం కలిగి ఉన్నారని, ఆ విషయాల్లో వారితో తమ పార్టీ పోటీ పడలేకపోతోందని రాహుల్ గాంధీ అన్నారు. దేశంలో కొన్నేళ్ల క్రితం తమ పార్టీ పూర్తిగా ఒంటరిగా, రాజకీయంగా చిక్కుకుపోయినట్లు భావించామని ఆయన వెల్లడించారు. తమకు అందుబాటులో ఉన్న మార్గాలన్నీ మూసుకుపోయాయని, మీడియా సహా ఏదీ తమకు అనుకూలంగా లేదని అన్నారు. ఈ ప్రతికూల పరిస్థితుల నేపథ్యంలోనే తమ పార్టీ చరిత్రను గుర్తుచేసుకుని, కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకు పాదయాత్ర (భారత్ జోడో యాత్ర) చేయాలని నిర్ణయించుకున్నట్లు రాహుల్ గాంధీ వివరించారు.

## ప్రజా ప్రభుత్వం మిషన్‌లో భాగస్వాములు కావాలి




- తెలంగాణ రైజింగ్‌కు బ్రాండ్ అంబాసిడర్లుగా మారండి
- ఈ రాష్ట్ర గొప్పతనాన్ని ప్రపంచానికి చాటండి
- అనుభవం, పరిజ్ఞానం, నైపుణ్యాలను మాతో పంచుకోండి
- విదేశీ ప్రతినిధులకు సీఎం రేవంత్‌రెడ్డి పిలుపు

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

సంక్షేమం, పెట్టుబడులు, ఉద్యోగావకాశాల కల్పన, పర్యావరణ సమతుల్యతను సాధిస్తూ ప్రజల జీవితాలను మెరుగుపరిచేందుకు ప్రజా ప్రభుత్వం చేపట్టిన మిషన్‌లో భాగస్వాములు కావాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భారత్ సమ్మిట్ వేదికగా ప్రపంచ దేశాలకు విజ్ఞప్తి చేశారు. దేశంలోనే తెలంగాణను అగ్రస్థానంలో

మిగితా 2వ పేజీలో

## ఎన్నికల గాంధీకి స్వాగతం

- బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**



ఎర్రబుక్కు పట్టుకుని రాజ్యాంగాన్ని రక్షించాలంటూ దేశమంతా తిరిగే కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీకి తెలంగాణలో మానవ హక్కులను మంటగలుపుతున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కనిపించలేదా? అని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత ప్రశ్నించారు. రేవంత్‌రెడ్డి దమనకాండను కొనసాగిస్తూ ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తుంటే మౌనంగా ఎందుకు ఉన్నారని, ఇది దేనికి సంకేతమని నిలదీశారు. రాహుల్ దారితప్పి తెలంగాణకు వచ్చారని, 'ఎన్నికల గాంధీకి స్వాగతం' అంటూ 'ఎక్స్' వేదికగా పేర్కొన్నారు. మోసపూరిత హామీలు, అబద్ధపు వాగ్దానాలతో తెలంగాణ ప్రజలను రాహుల్ మోసం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసుల లాఠీ దెబ్బలు తిన్న సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థులను పరామర్శించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ సర్కారు తన 16 నెలల పాలనలో ప్రజలను రాచి రంపాన పెట్టిందని మండిపడ్డారు. హైడ్రా, మూసి పేరుతో ప్రజలపైకి బుల్డోజర్లు పంపిందని నిప్పులు చెరిగారు. లగచర్ల బంజరా ఆడబిడ్డలపై అర్ధరాత్రి వేళ అఘాయిత్యాలకు ఒడిగట్టిందని ధ్వజమెత్తారు. బంజారా యువతపై థర్డ్ డిగ్రీ ప్రయోగించిందని ఆరోపించారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం సాగించిన ఈ రాక్షసకాండను జాతీయ మానవహక్కుల కమిషన్ నిర్ధారించిన విషయాన్ని ఈ సందర్భంగా కవిత గుర్తు చేశారు. కరెంటు పోయిందని సోషల్ మీడియాలో పోస్టులు పెట్టిన వారిని అరెస్టు చేసి, వేధింపులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు.

పచ్చని అడవిని సర్వనాశనం చేస్తుంటే నిరసనకు దిగిన హెచ్‌సీయూ విద్యార్థులపై పోలీసులు లాఠీల మోత మోగించి, అక్రమ కేసులు బనాయించి అరెస్టులు చేశారని కవిత నిప్పులు చెరిగారు. తెలంగాణ ప్రజలు సోనియా, ప్రియాంక, రాహుల్‌గాంధీని నమ్మి కాంగ్రెస్‌కు అధికారమిస్తే ఉమ్మడి రాష్ట్రానికి మించి నిర్బంధాన్ని, అణచివేతను తిరిగి బహుమతిగా ఇచ్చారని ధ్వజమెత్తారు. బీహార్‌లో గ్రూప్–1 బాధితుల గోడు వినాలని బాధితుల పక్షాన గళమెత్తిన రాహుల్ తెలంగాణలోని గ్రూప్–1 బాధిత అభ్యర్థుల ఆందోళనలపై ఎందుకు మౌనంగా ఉన్నారని నిలదీశారు. రాహుల్, సోనియా ఇచ్చిన ఆరు గ్యారెంటీల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు.

## ఎమ్మెల్సీ కవిత ఆ లెక్కలు బయటపెట్టాలి

- టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్



**బలగం టీవి, హైదరాబాద్**

టీపీసీసీ చీఫ్ రాహుల్ గాంధీపై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత చేసిన వ్యాఖ్యలకు టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ కౌంటర్ ఇచ్చారు. కేసీఆర్ హయాంలో హైదరాబాద్ భూముల అమ్మకాల లెక్కలపై మాట్లాడాలన్నారు. లిక్కర్ వ్యాపారం చేసిన కవిత.. రాహుల్ పై మాట్లాడటం సిగ్గుచేటు అని మండిపడ్డారు. 'కవిత వాళ్ల నాన్న, అన్న హైదరాబాద్ చుట్టూ 10 వేల ఎకరాల భూమిని ప్రైవేటు సంస్థలకు అప్పనంగా ఇచ్చారు. ఆమెకు చిత్తశుద్ధి ఉంటే ముందుగా వాటి లెక్కలు బయటకు తీయాలి. లిక్కర్ వ్యాపారం చేసి ఆమె.. దేశం కోసం శ్రమిస్తున్న రాహుల్ గాంధీని విమర్శిస్తే ప్రజలు హర్షించరు' అని మహేష్ కుమార్ వ్యాఖ్యానించారు.

## పెహల్‌గామ్ దాడి మా పని కాదు..

- 'ది రెసిస్టెన్స్ ఫ్రంట్'

**బలగం టీవీ, హైదరాబాద్**

పెహల్‌గామ్ ఉగ్రదాడి ఘటనపై ఉగ్రసంస్థ 'ది రెసిస్టెన్స్ ఫ్రంట్' సంచలన ప్రకటన చేసింది. మొదట ఈ దాడి తమ పనే అని ప్రకటించుకున్న ఆర్‌టీఎఫ్ .. ఇప్పుడు మాట మార్చింది. పెహల్‌గామ్‌లో పర్యాటకులపై దాడి తమ పని కాదని తెలిపింది. ఈ సందర్భంగా భారత్‌పై తీవ్ర ఆరోపణలు చేసింది.తమ వ్యవస్థలి భారత్ హ్యాక్ చేసినట్లు ప్రకటనలో ఆరోపించింది. 'పెహల్‌గామ్ ఘటనలో మా ప్రమేయం లేదు. ఈ చర్యను టీఆర్ఎఫ్‌కు ఆపాదించడం తొందరపాటు చర్యే అవుతుంది. ఇంతకు ముందు వచ్చిన ప్రకటనతో కూడా మాకు సంబంధం లేదు. భారత్ మా వ్యవస్థల్ని హ్యాక్ చేసి ఆ మెసేజ్ పోస్ట్ చేసింది. ఇది భారత సైబర్–ఇంటెలిజెన్స్ ఆపరేటివ్‌ల పని. దీనిపై మేము పూర్తి దర్యాప్తు చేస్తున్నాం. రాజకీయ ప్రయోజనాల కోసం భారత్ ఇలా చేయడం ఇదేమీ తొలిసారి కాదు' అంటూ ఆరోపించింది.


## పెహల్‌గామ్ దాడి మా పని కాదు..

- 'ది రెసిస్టెన్స్ ఫ్రంట్'

**బలగం టీవీ, హైదరాబాద్**

పెహల్‌గామ్ ఉగ్రదాడి ఘటనపై ఉగ్రసంస్థ 'ది రెసిస్టెన్స్ ఫ్రంట్' సంచలన ప్రకటన చేసింది. మొదట ఈ దాడి తమ పనే అని ప్రకటించుకున్న ఆర్‌టీఎఫ్ .. ఇప్పుడు మాట మార్చింది. పెహల్‌గామ్‌లో పర్యాటకులపై దాడి తమ పని కాదని తెలిపింది. ఈ సందర్భంగా భారత్‌పై తీవ్ర ఆరోపణలు చేసింది.తమ వ్యవస్థలి భారత్ హ్యాక్ చేసినట్లు ప్రకటనలో ఆరోపించింది. 'పెహల్‌గామ్ ఘటనలో మా ప్రమేయం లేదు. ఈ చర్యను టీఆర్ఎఫ్‌కు ఆపాదించడం తొందరపాటు చర్యే అవుతుంది. ఇంతకు ముందు వచ్చిన ప్రకటనతో కూడా మాకు సంబంధం లేదు. భారత్ మా వ్యవస్థల్ని హ్యాక్ చేసి ఆ మెసేజ్ పోస్ట్ చేసింది. ఇది భారత సైబర్–ఇంటెలిజెన్స్ ఆపరేటివ్‌ల పని. దీనిపై మేము పూర్తి దర్యాప్తు చేస్తున్నాం. రాజకీయ ప్రయోజనాల కోసం భారత్ ఇలా చేయడం ఇదేమీ తొలిసారి కాదు' అంటూ ఆరోపించింది.




## ఎల్‌ఓసీ వద్ద కాల్పుల కలకలం

**బలగం టీవి, న్యూఢిల్లీ బ్యూరో**

నియంత్రణ రేఖ వెంట మరోసారి కాల్పుల కలకలం రేగింది. రెచ్చగొట్టే ధోరణితో పాక్ ఆర్మీ కాల్పులకు తెగబడింది. వెంటనే భారత సైన్యం అప్రమత్తమై ప్రతిదాడులు జరిపింది. సమర్థంగా తిప్పికొట్టింది. ఏప్రిల్ 25 అర్ధరాత్రి ఈ ఘటన చోటుచేసుకున్నట్లు రక్షణ శాఖ అధికారులు శనివారం వెల్లడించారు. నియంత్రణ రేఖ వెంబడి పలు పోస్టుల నుంచి పాక్ ఆర్మీ కాల్పులు జరిపినట్లు తెలిపారు. ఈ ఘటనలో ఎలాంటి ప్రాణ నష్టం సంభవించలేదని, ఎవరికీ గాయాలు కాలేదని వెల్లడించారు. అర్ధరాత్రి వేళ కూడా పాక్ ఎల్‌ఓసీ వద్ద కాల్పులు జరిపింది.

## కర్రెగుట్టల్లో ఎన్‌కౌంటర్

- 28 మంది మావోయిస్టులు హతం..?
- తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ సరిహద్దులో ఘటన
- మావోయిస్టులకు భారీ ఎదురుదెబ్బ
- ఛత్తీస్‌గఢ్ పోలీస్ అధికారులతో పాటు కేంద్ర బలగాల ఆపరేషన్

వివరాలు 2వ పేజీలో



## వరంగల్ సభ సరికొత్త చరిత్ర సృష్టించబోతోంది

- బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- పార్టీ నేతలతో టెలికాన్ఫరెన్స్
- గులాబీ రంగు దుస్తులతో హాజరుకావాలని విజ్ఞప్తి
- సభా ప్రాంగణానికి చేరుకునేందుకు విస్తృత ఏర్పాట్లు




**బలగం టీవీ, హైదరాబాద్**

వరంగల్ వేదికగా జరగనున్న బీఆర్ఎస్ రజతోత్సవ సభకు లక్షలాదిగా తరలిరావాలని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపునిచ్చారు. ఈ మేరకు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పార్టీ ముఖ్య నేతలతో ఆయన టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రతి గ్రామంలో పార్టీ నేతలు, కార్యకర్తలు, ప్రజలతో కలిసి ఉదయాన్నే గులాబీ జెండాలు ఆవిష్కరించుకొని కదలిరావాలని సూచించారు. పార్టీ 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా జరుగుతున్న ఈ ప్రతిష్టాత్మకమైన సభకు హాజరయ్యే వారు గులాబీ రంగు దుస్తులు ధరించి రావాలని కోరారు. రాష్ట్ర నలుమూలల నుంచి సభకు తరలిరావాలనే ఉత్సాహం ప్రజల్లో పెద్ద ఎత్తున ఉందని, వారందరినీ సమన్వయం చేసుకొని అనుకున్న సమయానికి సభా ప్రాంగణానికి చేరుకునేలాగా ప్రణాళిక వేసుకోవాలని కోరారు.

పార్టీ సిల్వర్ జూబ్లీ సభకు తరలివచ్చే ప్రతి వాహనానికి అన్ని వైపులా గులాబీ జెండాలను కట్టుకుని ఉత్సాహంగా బయలుదేరాలని కోరారు. ఎండల వల్ల ఇబ్బంది లేకుండా ప్రతి బస్సులో మంచినీళ్ల బాటిళ్ళు, మజ్జిగ ప్యాకెట్లతోపాటు భోజన వసతికి సంబంధించిన ఏర్పాట్లు చేసుకోవాలని అన్నారు. తెలంగాణ నలువైపుల నుంచి తరలివచ్చే వాహనాలు ట్రాఫిక్ జామ్ కాకుండా ఇప్పటికే రూట్ మ్యాప్ పంపించామని, దానికి అనుగుణంగానే ఆయా రూట్లలో సభ స్థలికి చేరుకోవాలని తెలిపారు. సభా ప్రాంగణానికి 30 కిలోమీటర్ల దూరం నుంచి రోడ్లపై ఎక్కడ వాహనాలు నిలపరాదని, నేరుగా వారికి సూచించిన పార్కింగ్ స్థలాలకు చేరుకొని మాత్రమే వాహనాలను నిలపాలని సూచించారు.

అనేక ప్రాంతాల్లో పార్టీ వాలంటీర్లు ఎప్పటికప్పుడు గైడ్ చేసేందుకు సిద్ధంగా ఉంటారని వెల్లడించారు. సభకు చేరుకున్న వారికి ఎలాంటి ఇబ్బంది లేకుండా ఎక్కడికక్కడ మంచినీటి బాటిళ్లతోపాటు, మజ్జిగ ప్యాకెట్లు అందించేందుకు వాలంటీర్లు సిద్ధంగా ఉంటారని తెలిపారు. చారిత్రక సభలో కేసీఆర్ గారి ప్రసంగంపై అన్ని వర్గాల్లో పెద్ద ఎత్తున ఆసక్తి నెలకొని ఉందని, రాష్ట్ర రాజకీయాల్లో ఈ సభ సరికొత్త చరిత్రను సృష్టించబోతుందని కేటీఆర్ స్పష్టం చేశారు.

## ఎస్ఎల్‌బీసీ సహాయక చర్యలకు బ్రేక్



ఫైల్ ఫోటో

- ఫిబ్రవరి 22న దుర్ఘటన
- లభించని ఆరుగురి ఆచూకీ

**బలగం టీవీ, హైదరాబాద్**

ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌లో రెస్క్యూ ఆపరేషన్‌ను శనివారం నిలిపి వేశారు. ఎస్ఎల్‌బీసీ సోరంగంలో ఫిబ్రవరి 22న ప్రమాదం జరిగి ఎనిమిది మంది గల్లంతయ్యారు. ప్రమాదం జరిగిన నాటి రెస్క్యూ ఆపరేషన్ చేపట్టారు. ఇప్పటి వరకు 63 రోజులుగా అవిశ్రాంతంగా కొనసాగిన రెస్క్యూ ఆపరేషన్‌కు శనివారం నుంచి తాత్కాలికంగా బ్రేక్ పడింది. ఇద్దరి మృతదేహాలను వెలికితీసిన రెస్క్యూ సిబ్బంది, మిగిలిన ఆరుగురి ఆచూకీ కోసం ఆపరేషన్ కొనసాగించారు. అయితే ఇంత వరకు ఆరుగురి ఆచూకీ లభ్యం కాలేదు. టన్నెల్‌లో నిరంతరం పనిచేసిన ఎక్స్‌కవేటర్లు గురువారం బయటకు వచ్చాయి. శిథిలాల తొలగింపు దాదాపు పూర్తయినప్పటికీ, ప్రమాదకరమైన జోన్‌లో మాత్రం ఇంకా తొలగించాల్సి ఉందని అధికారులు తెలిపారు. సాంకేతిక కమిటీ సూచనల మేరకు, సహాయక చర్యలను మూడు నెలల పాటు నిలిపివేశారు.

శ్రీశైలం ఎడమగట్టు కాలువ (ఎస్ఎల్‌బీసీ) సొరంగంలో కొనసాగుతున్న

వివరాలు 2వ పేజీలో

# భద్రతకు నోడల్ ఏజెన్సీ అవసరం

- **హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్**

**బలగం టీవీ, హైదరాబాద్**

ప్రజల భద్రతకు ప్రథమ ప్రాధాన్యాన్నివ్వాలని, అందుకు నోడల్ ఏజెన్సీ అవసరమని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ అన్నారు. ప్రమాదాల నివారణకు విద్యుత్, ఫైర్, ఇండస్ట్రీ ఇలా ఎవరికి వారు కాకుండా ఇందుకు ఉద్దేశించిన వ్యవస్థలన్నీ ఒక ప్లాట్‌ఫామ్‌పైకి వచ్చి పని చేయాల్సిన అవసరం ఉందన్నారు. 'ఎలక్ట్రికల్ సేఫ్టీ ఇన్ బిల్డింగ్స్' అనే అంశంపై శనివారం హైడ్రా కార్యలయంలో జరిగిన సదస్సులో కమిషనర్ మాట్లాడారు. విద్యుత్ వినియోగంలో ఉన్న లోపాలవల్లే ఎక్కువ అగ్ని ప్రమాదాలు జరుగుతున్నాయని, తీసుకోవాల్సిన జాగ్రత్తలతో పాటు అందరిలో అవగాహన పెంచాల్సిన అవసరం ఉందన్నారు. భద్రతకు సంబంధించి అన్ని జాగ్రత్తలు తీసుకున్నారో లేదో పరిశీలించడానికి సంబంధిత విభాగాలకు చెందిన నిపుణుల బందంతో ఒక నోడల్ ఏజెన్సీని రూపొందించాలని కమిషనర్ అభిప్రాయపడ్డారు. విద్యుత్ వైరింగ్, ఎర్తింగ్, నాణ్యమైన ఎలక్ట్రిక్ పరికరాలను వినియోగిస్తున్నారా లేదా అనేది తనిఖీ చేయాల్సినవసరం ఉందన్నారు. పరిశ్రమలే కాకుండా అపార్టుమెంట్లు, కార్యాలయాలు, నివాసాలలో కూడా భద్రతా ప్రమాణాలు పాటించేలా ఈ నోడల్ ఏజెన్సీ చూడాలన్నారు. దుర్ఘటన జరిగిన తర్వాత పోస్టుమార్టం చేసేలా కాకుండా, ప్రమాదానికి ఆస్కారం లేని విధంగా చర్యలు తీసుకోవాలన్న ఉద్దేశంతోనే ఈ సదస్సు పెట్టామని అభిప్రాయపడ్డారు. హైడ్రాకు చెందిన డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్సు విభాగం



ఈ సమన్వయాన్ని తీసుకురావాలని సూచించారు. డైరెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ రాజగోపాల్, బాయిలర్స్ డిపార్టుమెంట్ డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ భీమారావు, డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ శ్రీనివాస్, డిప్యూటీ చీఫ్ ఎలక్ట్రికల్ ఇన్‌స్పెక్టర్ జనరల్ చంద్రశేఖర్, సినర్జీ కన్సల్టెంట్ శ్రీనివాస్, ఎలక్ట్రికల్ కన్సల్టెంట్ కష్ణ రమేష్ తదితరులు మాట్లాడుతూ పరిశ్రమలు, భారీ కట్టడాలు, నివాస సముదాయాల భద్రత విషయంలో ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారో వివరించారు. ఈ కార్యక్రమంలో హైడ్రా ఫైర్ విభాగం అదనపు సంచాలకులు పాపయ్య, ఎస్పీ సుదర్శన్, డిప్యూటీ కలెక్టర్ సుధ, ఆర్ఎఫ్‌వో జయప్రకాశ్, డీఎఫ్‌వోలు యజ్ఞనారాయణ, గౌతం, ఎస్ఎఫ్‌వోలు పాల్గొన్నారు.

# కాళేశ్వరం ఈఎన్సీ ఆస్తులపై ఏసీబీ దాడులు

**బలగం టీవీ, హైదరాబాద్**

కాళేశ్వరం ఇంజినీరింగ్ చీఫ్ భూక్య హరిరాం ఆదాయానికి మించి రూ. కోట్లలో అక్రమాస్తులను సంపాదించారనే ఆరోపణలపై ఏసీబీ అధికారులు ఆయన ఆస్తులపై మెరుపుదాడులను నిర్వహించారు. హరిరాంతో పాటు ఆయన భార్య డిప్యూటీ ఇంజినీరింగ్ చీఫ్, వాలాంతరీ సంస్థ డైరెక్టర్ సునీత ఆస్తులపై కూడా ఏకకాలంలో ఏసీబీ అధికారులు ఆరా తీస్తున్నారు. ఏసీబీకి డైరెక్టర్ జనరల్ విజయ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. కాళేశ్వరంతో పాటు ఇరిగేషన్ విభాగం గజ్వేల్ శాఖలో చీఫ్ ఇంజినీర్ అయిన హరిరాం ఆ ప్రాజెక్ట్ డిజైన్ మార్పిడితో పాటు దాని నిర్మాణానికి అవసరమైన కోట్లాది రూపాయల రుణ సేకరణలో కీలక పాత్ర వహించినట్టు ఏసీబీ వర్గాలు తెలిపాయి. ఆ సందర్భంలోనే అక్రమాలకు పాల్పడి హరిరాం కోట్లాది రూపాయల అక్రమా స్తులను సంపాదించినట్టు ఏసీబీ దృష్టికి వచ్చింది. దీంతో ఉదయం 5 గంటల నుంచే పదికి పైగా ఏసీబీ ప్రత్యేక బృందాలు హరిరాంనకు చెందిన ఆస్తులపై దాడులను ప్రారంభించాయి. షేక్‌పేట్‌లో ని విల్లాతో పాటు హైదరా బాద్, సిద్ధిపేట్, కొత్తగూడెం జిల్లాల్లోని ఆయన బంధువుల నివాసాల్లోనూ ఏసీబీ అధికా రులు సోదాలను జరుపుతున్నారు. ఈ సోదాల్లో షేక్‌పేట్‌లో ఒక విల్లా, కొండాపూర్‌లో మరో విల్లా, శ్రీనగర్‌లో ఒక ఫ్లాట్, మాదాపూర్‌లో మరో ఫ్లాట్, నార్సింగిలో ఇంకో ఫ్లాట్ ఉన్నట్టు అధికారులు కనుగొన్నారు. అలాగే, అమరావతిలో విలువైన వాణిజ్య భూమి, సిద్ధిపేట్ జిల్లా మర్కూక్ మండలంలో 28 ఎకరాల భూమి, పటాంచెరులో 20 గుంటల భూమి కూడా ఉన్నట్టు తేల్చారు. అలాగే, హైదరాబాద్ శ్రీగర్‌కాలనీలో రెండు నివాసాలు, బొమ్మల రామారంలో మామిడితోటతో కూడిన ఆరెకరాల భూమి, కొత్తగూడెంలో నిర్మాణంలో ఉన్న ఒక భవనం, కుత్బుల్లాపూర్‌లో ఒక ప్లాటు, మిర్యాలగూడలో మరో ప్లాటు ఉన్నట్టు కనిపెట్టారు. అలాగే, సొంతంగా ఒక బీఎండబ్ల్యూ కారుతో పాటు మరో కారు, ఇంట్లో బంగారు ఆభరణాలు, పెద్ద మొత్తంలో బ్యాంకు డిపాజిట్లు కూడా కలిగి ఉన్నట్టు అధికారులు సోదాలో తేల్చారు. కాగా, నిందితుడు హరిరాంను అరెస్ట్‌చేసిన అధికారులు.. ఇంకా సోదాలను నిర్వహిస్తున్నారని ఏసీబీ డీజీ తెలిపారు. ప్రస్తుతానికి తేలిన ఆస్తుల విలువ కోట్ల రూపాయల్లోనే ఉంటుందని ఆయన చెప్పారు. ఈ సోదాలు రాత్రి పొద్దుపోయేంత వరకు కూడా కొనసాగుతాయని తెలిపారు. మొత్తం 14 ప్రాంతాల్లో హరిరాం, ఆయన భార్య పేరిట ఉన్న ఆస్తులతో పాటు వారి బినామీల పేరిట ఉన్న ఆస్తుల పైనా సోదాలను జరుపుతున్నారు.

# వందలాది గుడిసెలు దగ్ధం

- **రంగారెడ్డి జిల్లా కుంట్లూరులో అగ్నిప్రమాదం**
- **మంటల్లో సిలిండర్‌లు తోడవడంతో ఎగిసిపడిన అగ్ని కిలలు**
- **బూడిదైన సర్టిఫికెట్స్, డబ్బులు**

**బలగం టీవీ, హైదరాబాద్**

హైదరాబాద్ నగర శివారులో భూ పోరాట కేంద్రం గుడిసెవాసుల కాలనీలో శనివారం భారీ అగ్నిప్రమాదం సంభవించింది. పెద్ద ఎత్తునఎగిసిపడిన మంటలకు వందలాది గుడిసెలు పూర్తిగా ఆహుతయ్యాయి. ఈ సంఘటన రంగారెడ్డి జిల్లా, అబ్దుల్లాపూర్‌మెట్ మండలం, పెద్ద అంబర్‌పేట్ మున్సిపల్ పరిధిలోని కుంట్లూరు భూదాన్ రావినారాయణరెడ్డి కాలనీ ఫేస్‌- 3 కాలనీలో చోటుచేసుకుంది

స్థానికులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం కుంట్లూరులోని రావినారాయణరెడ్డి కాలనీ ఫేస్3లో గత కొన్ని సంవత్సరాల నుంచి సర్వేనెం. 215 నుంచి 224 లో 80 ఎకరాలకు పైగా ఉన్న భూదాన భూమిలో వివిధ ప్రాంతాల నుంచి నగరానికి వలస వచ్చిన పేదలు సీపీఐ ఆధ్వర్యంలో సుమారుగా 8 వేల గుడిసెలు వేసుకొని నివాసం ఉంటున్నారు. రోజువారీ పనుల్లో భాగంగా గుడిసె వాసులు పనికి వెళ్లేవారు. శనివారం కూడా అలాగే వెళ్లగా మధ్యాహ్నం సమయంలో ఆకస్మాతుగా ఓ గుడిసెలో నుంచి మంటలు చెలరేగి పక్కనున్న గుడిసెలకు అంటుకున్నాయి. గుడిసెల్లో ఉన్న గ్యాస్ సిలిండర్‌లు పేలడంతో సుమారుగా 400 గుడిసెలు క్షణాల్లో కాలి బూడిదయ్యాయి. వెంటనే స్థానికులు, బాధితులు ఫైర్ సేఫ్టీ అధికారులకు సమాచారం అందించడంతో వారు అక్కడికి చేరుకొని మంటలను అదుపులోకి తెచ్చారు. నెమరుపాటు ఆలస్యమైనా అక్కడ ఉన్న ఎనిమిది వేల గుడిసెలు అగ్నికి ఆహోతయ్యేవి. స్థానిక తహసీల్దార్ సుదర్శన్ రెడ్డి, రెవిన్యూ సిబ్బంది, పెద్ద ఎత్తున పోలీసులు ఘటన స్థలాన్ని చేరుకొని పరిస్థిని సమీక్షించారు. ఘటనకు సంబంధించిన నివేదికను రెవిన్యూ అధికారులు ప్రభుత్వం దష్టికి తీసుకెళ్ళనున్నారు.

అగ్ని ప్రమాదం సమాచారం అందుకున్న సీపీఐ జాతీయ కార్యవర్గసభ్యులు చాడ వెంకట్ రెడ్డి ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆకస్మికంగా గుడిసెలు కాలి బూడిద కావడం వల్ల పేదల బతుకులు అత్యంత దయనీయ స్థితికి చేరాయన్నారు. కూలి డబ్బులు, దాచుకున్న డబ్బులు, విద్యార్థుల సర్టిఫికెట్స్ కాలిపోవడంతో పేదల బతుకులు మరింత దారుణంగా మారాయన్నారు. ప్రభుత్వం తక్షణమే వారికి ఇంటి స్థలాలు ఇవ్వడంతో పాటు ఇందిరమ్మ ఇండ్లు కట్టించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. సీపీఐ బాధితులకు అండగా ఉంటుందన్నారు మీరు ఎక్కడా అధైర్య పడవద్దని.. ఇంటి స్థలాలు, ఇండ్లు దక్కే వరకు పోరాడుదామన్నారు.

# గులాబీ పండుగకు సర్వం సిద్ధం

(మొదటి పేజీ తరువాయి)

రజతోత్సవ సభకు పోలీసు అధికారులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. 1,100 మంది పోలీసులు విధులు నిర్వహించనున్నారు. ఇద్దరు డీసీపీలు, ఇద్దరు అదనపు డీసీపీలు, 8 మంది ఏసీపీలు, 28 మంది ఇన్స్‌పెక్టర్లు, ఆర్‌ఐలు, 66 మంది ఎస్‌ఐలు, 137 మంది ఏఎస్‌ఐలు, హెడ్ కానిస్టేబుళ్లు, 511 మంది కానిస్టేబుళ్లు, 200 మంది హోంగార్డులతోపాటు డిస్ట్రిక్ట్ గార్డ్స్ సిబ్బంది విధులు నిర్వహించనున్నారు. సభకు వచ్చే ప్రధాన రహదారుల్లో ట్రాఫిక్ రద్దీ నివారణకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. ఒకవైపు పోలీసు అధికారులు, మరోవైపు బీఆర్‌ఎస్ శ్రేణులు ట్రాఫిక్ రద్దీని క్లియర్ చేసేందుకు ముందస్తు చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. ఈ క్రమంలో ఎక్కడా ట్రాఫిక్ జామ్ జరగకుండా పార్టీ నేతలు, కార్యకర్తలే ట్రాఫిక్ సిబ్బందిగా పనిచేయాలని నేతలు పిలుపునిచ్చారు.

# కర్రెగుట్టల్లో ఎన్‌కౌంటర్

- **28 మంది మావోయిస్టులు హతం..?**

**బలగం టీవీ, హైదరాబాద్**

తెలంగాణ–ఛత్తీస్‌గఢ్ సరిహద్దులోని కర్రెగుట్టల్లో భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. శనివారం ఉదయం జరిగిన ఈ కాల్పుల్లో 38 మంది మావోయిస్టులు మృతి చెందినట్టు సమాచారం. ఉదయం 28 మంది మావోయిస్టులు మతి చెందినట్టు... సాయంత్రం వరకు ఆ సంఖ్య 38కి చేరినట్టు ప్రచారం జరిగింది. ఈ విషయాన్ని అధికారికంగా ధ్రువీకరించాల్సి ఉంది. దీనిపై అటు ప్రభుత్వం నుంచి కానీ, ఇటు అధికారుల నుంచి కానీ ఎలాంటి అధికారిక సమాచారమూ అందలేదు. మావోయిస్టుల ఏరివేతే లక్ష్యంగా పెద్ద ఎత్తున భద్రతా బలగాలు చేపట్టిన భారీ కూంబింగ్ ఆపరేషన్ సందర్భంగా ఈ ఘటన చోటు చేసుకున్నది. గత కొన్ని రోజులుగా కేంద్ర బలగాలు కూంబింగ్ ఆపరేషన్‌ను కొనసాగిస్తున్నాయి. ఇందులో భాగంగా కేంద్ర పారామిలిటరీ బలగాలు, మావోయిస్టుల మధ్య కాల్పులు జరుగుతున్నాయి.

కేంద్ర పారామిలటరీ బలగాల నేతృత్వంలో కర్రెగుట్టల్లో గత కొన్ని రోజుల నుంచి కూంబింగ్ ఆపరేషన్ కొనసాగుతోంది. ఏరియల్ సర్వే ద్వారా ఎప్పటికప్పుడు బలగాలకు సమాచారం అందుతోంది. మావోయిస్టు మోస్ట్ వాంటెడ్ అయిన హిడ్మా, దేవ టార్గెట్‌గా కూంబింగ్ కొనసాగుతున్నట్టు సమాచారం. వేల సంఖ్యలో బలగాలు ఈ ఆపరేషన్‌లో పాల్గొన్నాయనీ, మావోయిస్టులను రౌండప్ చేశాయని శుక్ర వారం ప్రచారం జరిగింది. ఈ క్రమంలో కర్రెగుట్టల్లో మావోయిస్టులు, భద్రతా బలగాలకు మధ్య జరిగిన భీకర కాల్పుల్లో 38 మంది మావోయిస్టులు చనిపోయినట్టు సమాచారం అందింది. ఈ వార్తే నిజమైతే మావోయిస్టులకు ఇది మరో పెద్దదెబ్బ అని విశ్లేషకులు చెప్తున్నారు.

# ప్రజా ప్రభుత్వం మిషన్‌లో భాగస్వాములు కావాలి

(మొదటి పేజీ తరువాయి)

నిలపడానికి పారదర్శకమైన సంస్కరణలతో, రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించడానికి ఇంకా ఎంతో చేయాల్సి ఉందని చెప్పారు. అందుకోసం "తెలంగాణ రైజింగ్" బ్రాండ్ అంబాసిడర్లుగా రాష్ట్ర గొప్పతనాన్ని, ప్రజల ఆకాంక్షలను ప్రపంచానికి చాటాలని సదస్సును ఉద్దేశించి కోరారు.భారత్ సమ్మిట్‌లో ముఖ్యమంత్రి ప్రసంగించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్రం సాధిస్తున్న ప్రగతిని, సంక్షేమ పథకాలను, మరియు సమగ్ర అభివృద్ధి లక్ష్యాలను వివరించారు. "విద్యార్థులు, కార్మిక సంఘాలు, రైతులు, మహిళల నాయకత్వంలో దశాబ్దాల పాటు జరిగిన పోరాటాల ఫలితంగా తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడింది. మొదటి దశాబ్దంలో ప్రజల ఆకాంక్షలు నెరవేరకపోవడంతో ఏర్పడిన నిరాశను తొలగించడానికి ప్రజా ప్రభుత్వం ఆ వర్గాల ఆశలను నెరవేర్చే స్పష్టమైన లక్ష్యంతో పనిచేస్తోంది. ప్రభుత్వం వ్యవసాయ రంగానికి అత్యంత ప్రాధాన్యతనిచ్చింది. 20 వేల కోట్ల రూపాయలతో 25 లక్షలకుపైగా రైతులకు రుణమాఫీ చేసి దేశ చరిత్రలోనే అతిపెద్ద రుణమాఫీ కార్యక్రమాన్ని అమలు చేశాం. సేద్యానికి 24 గంటల ఉచిత విద్యుత్‌తో పాటు రైతు భరోసా పథకం కింద ఎకరానికి రూ. 12 వేలు పంట పెట్టుబడి సహాయం, భూమి లేని వ్యవసాయ కార్మికుల కుటుంబానికి కూడా రూ. 12 వేల మద్దతుని ప్రభుత్వం అందిస్తోంది.ధాన్యానికి కనీస మద్దతు ధరతో పాటు ప్రతి క్వింటాలుపై రూ. 500 అదనపు బోనస్ అందిస్తూ రైతాంగానికి అండగా నిలుస్తూ ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తున్నాం.యువతకు నైపుణ్యాలను అందించేందుకు యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్శిటీని స్థాపించాం. గతంలో ఉద్యోగ నియామకాలు లేని పరిస్థితిని సవరిస్తూ, ప్రభుత్వం ఏర్పడిన తొలి ఏడాదిలోనే 60 వేలకు పైగా ఉద్యోగాలను భర్తీ చేశాం. రాజీవ్ యువ వికాసం పథకం ద్వారా 5 లక్షల మంది యువకులకు ఉపాధి అవకాశాలను కల్పించబోతున్నాం.

దావోస్, అమెరికా, దక్షిణ కొరియా, జపాన్, సింగపూర్‌లలో పెట్టుబడి సమ్మిట్ల ద్వారా రాష్ట్రానికి రూ. 2.5 లక్షల కోట్ల పెట్టుబడులను ఆకర్షించాం. వీటి ద్వారా ప్రైవేట్ రంగంలో ఉద్యోగ అవకాశాలను సృష్టిస్తున్నాం. తెలంగాణ వేగంగా పెరుగుతున్న ఆర్థిక వ్యవస్థ, అత్యధిక స్వంత పన్ను వసూళ్లు, జీసీసీలు, డేటా సెంటర్లు, ఎలక్ట్రిక్ వాహనాల రంగాల్లో అభివృద్ధితో పాటు దేశంలో రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలుపాలని యత్నిస్తున్నాం.తెలంగాణ సంస్కృతిలో మహిళలకు సమాన గౌరవం ఉండాలన్న లక్ష్యంతో ఉచిత రవాణా సౌకర్యం కల్పించాం. 200 యూనిట్ల ఉచిత గృహ విద్యుత్, రూ. 500 లకే గ్యాస్ సిలిండర్, రేషన్ ద్వారా సన్న బియ్యం అందిస్తున్నాం.ప్రభుత్వం రాష్ట్రంలోని స్వయం సహాయక సంఘాల్లో 67 లక్షల మంది సభ్యులను కోటికి పెంచడమే కాకుండా వారిని కోటీశ్వరులను చేయాలన్న లక్ష్యంతో పనిచేస్తోంది. అందులో భాగంగా మహిళలకు సోలార్ పవర్ ప్లాంట్లు, ఆర్టీసీ బస్సులు, పెట్రోల్ బంకులు, మరియు ప్రీమియం రిటైల్ ఔట్‌లెట్లలో షాపులు, సోలార్ విద్యుత్ ఉత్పత్తి, బస్సులను కేటాయించడం వంటి అనేక చర్యలు చేపట్టాం" అని అన్నారు.

# ఎస్ఎల్‌బీసీ సహాయక చర్యలకు బ్రేక్

(మొదటి పేజీ తరువాయి)

సహాయక చర్యలను నిలిపివేయాలని సాంకేతిక కమిటీ నిర్ణయానికి వచ్చింది. టన్నెల్ ఇన్లెట్ వైపు నుండి 13.6 కిలోమీటర్ల తర్వాత ముందుకు వెళ్లడం సురక్షితం కాదని కమిటీ స్పష్టం చేసింది. ఈ మేరకు, గురువారం జలసౌధలో రెవెన్యూ శాఖ (విపత్తులు) ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అరవింద్ కుమార్ అధ్యక్షతన సాంకేతిక కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఫైర్ సర్వీసెస్ డీజీ నాగిరెడ్డి, నీటిపారుదల శాఖ ప్రత్యేక కార్యదర్శి ప్రశాంత్ జీవన్ పాటిల్, ఏపీలోని ఎన్‌డీఆర్ఎఫ్ 10వ బెటాలియన్ కమాండెంట్, నేషనల్ జియోఫిజికల్ పరిశోధనా సంస్థ డైరెక్టర్, జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా డిప్యూటీ డైరెక్టర్, నేషనల్ సెంటర్ ఫర్ సిస్మాలజీ భూశాస్త్రవేత్త , బార్డర్ రోడ్ ఆర్గనైజేషన్ (బీఆర్‌వో) నుండి టన్నెల్ నిపుణులు పరీక్షిత్ మెహ్రా పాల్గొన్నారు. వారి సూచనల మేరకే ఈ నిర్ణయం తీసుకున్నారు



## శాంతి భద్రతలు కాపాడేందుకు సహకరించాలి

**-ప్రభుత్వ విప్ అది శ్రీనివాస్**
**బలగం టీవీ, వేములవాడ**

సాగునీటి, త్రాగునీటి రంగంలో తో పాటు ప్రజా సంక్షేమం కోసం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తూ అన్ని రంగాల్లో ముందుకు వెళ్తున్నామని ప్రభుత్వ విప్ అది శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం వేములవాడ పట్టణంలోని సబ్ డివిజన్ పోలీసు అధికారి కార్యాలయంలో నూతనంగా ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను ఏఎస్పీ శేషాద్రిని రెడ్డి తో కలసి ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ అది శ్రీనివాస్ మాట్లాడుతూనిఘా కేంద్రాలను వేములవాడ పట్టణం, పరిసర ప్రాంతాలు, అన్ని దారులను కలుపుతూ అమార్చడం అభినందనీయమని అన్నారు.దేవస్తానం ఆధ్వర్యంలో 12లక్షలతో 113 కెమెరాలు ఏర్పాటు చేయడం జరిగిందని,ఒక్కో సీసీ కెమెరా వెయ్యి మందితో సమానమని అన్నారు.దొంగతనాలు, మర్డర్లు, సంఘ విద్రోహ చర్యలు తగ్గుముఖం పట్టడానికి సీసీ కెమెరాలు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు.మూడు మసాల క్రితం బాలికను కిడ్నాప్ చేసిన మూడు రోజుల్లో కుటుంబ సభ్యులకు అప్పగించడం జరిగింద ని,పోలీసు శాఖ వారు కృషి అభినదనీయమని, దసరా రోజు కూడా డ్యూటీ చేస్తున్నారని అన్నారు.

సీఎం రేవంత్ రెడ్డి పోలీసు కుటుంబ పిల్లలకు కోసం యంగ్ ఇండియా స్కూల్ ఏర్పాటు చేస్తున్నారని, ప్రతినిత్యం ప్రజల మధ్యన ఉంటూ వారి పిల్లలకు నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం ముందుకు పోతుందని అన్నారు.

రుద్రంగి పోలీసు స్టేషన్ నిర్మాణం కోసం 2.50 కోట్లు మంజూరు చేయడం జరిగిందని, వేములవాడలో ట్రాఫిక్, మహిళా పోలీసు స్టేషన్, జిల్లా కేంద్రంలో మహిళా, ట్రాఫిక్ పోలీసు స్టేషన్ రావాల్సిన అవసరం ఉందని అన్నారు.నియోజకవర్గ ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ఉండేందుకే క్యాంప్ కార్యాలయాన్ని డీఎస్పీ కార్యాలయనికి అప్పగించడం జరిగిందని అన్నారు.భవిష్యత్ లో కూడా ఫ్రెండ్లీ పోలీసు కు అర్థం చెప్పేలా పోలీసుల విధులు నిర్వర్తించాలని,రిసెప్షన్ దగ్గర నుండి అధికారి వరకు స్టేషన్ కు వచ్చిన అందరికీ సౌకర్యాలు కల్పించాలని అన్నారు.

పిటిషన్లు రాయడంలో తప్పులు లేకుండా చూడాలని, పిటిషన్ దారులు చెప్పినట్లే ఫిర్యాదులు రాయాలి ఎట్టి పరిస్థితుల్లో మార్చవద్దని, పిటిషన్ మార్చడంతో బాధితులకు అన్యాయం జరుగుతుందని అన్నారు. రాజన్న ఆలయ పరిసర ప్రాంతాల్లో ఎక్కువ సమయం దుకాణాలు తెరిచి ఉంచేలా చూడాలని, దుకాణదారులను పోలీసులు ఇబ్బందులు పెట్టవద్దని,భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా మనం చొరవ తీసుకోవాలని అన్నారు.

గంజాయ్, డ్రగ్స్ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దాలని, మాదకద్రవ్యాల నివారణకు పోలీసు శాఖకు పూర్తి సహకారం అందిస్తామని అన్నారు. రాజన్న ఆలయ అభివృద్ధి కొరకు నిష్టతో, కంకణ బద్దులమై పని చేస్తున్నామని, ఆదివారం శృంగేరీ పీఠం కు వెళ్ళి తుది అనుమతులు తీసుకువస్తామని అన్నారు. పట్టణాన్ని, ఆలయాన్ని అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నామని,అభివృద్ధి జరగాలంటే ఇబ్బందులు తప్పవు, అయినప్పటికీ వారికి న్యాయం చేస్తూ ముందుకు వెళ్తున్నామని అన్నారు.

## ప్రతి గ్రామంలో గ్రామ పరిపాలనాధికారి ఏర్పాటుకు చర్యలు..

**-భూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా**
**భూ భారతి చట్టం రూపకల్పన..**
**-కలెక్టర్ సందీప్ కుమార్ ఝ**
**బలగం టీవీ,తంగళ్ళపల్లి**



భూ హక్కుల రికార్డుల్లో తప్పుల సవరణకు అర్హులైన వారు మన జిల్లాలో నూతన చట్టం అమల్లోకి వచ్చిన ఏడాది లోగా దరఖాస్తు చేసుకోవాలని, ఆ దరఖాస్తులను పరిశీలించి రెవెన్యూ డివిజన్ అధికారి, కలెక్టర్ ఒక నిర్ణయం తీసుకుంటారని, దరఖాస్తుదారునికి ఏమైనా అభ్యంతరాలు ఉంటే కలెక్టర్, భూమి ట్రిబ్యూనల్ లో అప్పీల్ చేసుకోవచ్చని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు.శనివారం తంగళ్ళపల్లి మండల కేంద్రంలోని ఫంక్షన్ హాల్ లో నిర్వహించిన భూ భారతి చట్టం అవగాహన కార్యక్రమంలో కలెక్టర్ హాజరై, మాట్లాడుతూ భూ సమస్యల పరిష్కరించడమే లక్ష్యంగా ప్రభుత్వం రూపొందించిన భూ భారతి (రికార్డు ఆఫ్ రైట్స్ ఇన్ ల్యాండ్) చట్టం 2025 అమల్లోకి వచ్చిందని, ముందుగా రాష్ట్రంలోని 4 మండలాలలో పైలెట్ ప్రాజెక్టు కింద ఈ చట్టం అమలు చేస్తున్నారని అన్నారు. వారసత్వం లేదా వీలు నామా ద్వారా భూమిపై హక్కుల సంక్రమిస్తే తహసిల్దార్ విచారణ జరిపి హక్కుల రికార్డుల్లో మ్యూటేషన్ చేస్తారని, నిర్ణిత గడువు 30 రోజుల లోగా పూర్తి చేయకుంటే ఆటోమేటిక్ గా మ్యూటేషన్ జరుగుతుందని అన్నారు.భూముల రిజిస్ట్రేషన్ మ్యూటేషన్ సమయంలో తప్పనిసరిగా భూమి పటం అందుబాటులో ఉండాలని, మండలాల్లో లైసెన్స్ సర్వేయర్ల ద్వారా భూమి మ్యాప్ తయారు చేస్తేనే రిజిస్ట్రేషన్ మెడిటేషన్ జరిగేలా చట్టంలో వ్యవస్థ కల్పించామని అన్నారు. ప్రతి గ్రామంలో రెవెన్యూ రికార్డుల తయారు చేసి, ప్రతి సంవత్సరం గ్రామాలలో రికార్డు డిస్ ప్లే చేయడం జరుగుతుందని అన్నారు.

రెవెన్యూ వ్యవస్థను బలోపేతం చేసేందుకు ప్రతి గ్రామంలో గ్రామ పరిపాలన అధికారులను నియమించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని అన్నారు. మనిషికి ఆధార్ కార్డు లాగా భూమికి భూదార్ సంఖ్య కేటాయింపు ప్రణాళిక చేస్తుందని, దీని ద్వారా భూ ఆక్రమణలకు చెక్ పెట్టవచ్చని అన్నారు. పెండింగ్ లో ఉన్న సాధా బైనామా పరిష్కారం కోసం భూ భారతి చట్టంలో ప్రభుత్వం అవకాశం కల్పించిందని అన్నారు.

భూ భారతి చట్టం పై అవగాహన కల్పించేలా కర పత్రాలను పంపిణీ చేశామని, ప్రజలు వీటిని గమనించాలని ఏమైనా సందేహాలు ఉంటే తీర్చడానికి అధికారులు ఎప్పుడూ సిద్ధంగా ఉంటారని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మెన్ నాగుల సత్యనారాయణ గౌడ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ వెలుముల స్వరూప, సిరిసిల్ల ఆర్డీఓ రాధాభాయి, వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మెన్ నర్సింగం, తహశీల్దార్ జయంత్, సంజీవ్, తదితరులు పాల్గొన్నారు.

**సన్న వడ్ల సేకరణకు రైస్ మిల్లులు సిద్ధం : కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**

**రాజన్న సిరిసిల్ల:** జిల్లాలో సన్న వడ్లు పండించిన రైతుల ధాన్యం సేకరించేందుకు రైస్ మిల్లర్లు సిద్ధంగా ఉన్నారని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.ఈ సందర్భంగా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడుతూ జిల్లాలో సన్న వడ్లు పండించిన రైతులు తమ గ్రామంలోని కొనుగోలు కేంద్రాల్లో సరైన తేమశాతం తో విక్రయించాలని అన్నారు. జిల్లాలోని 18 రైస్ మిల్లులు సన్న వడ్లు సేకరించేందుకు సిద్ధంగా ఉన్నారని కలెక్టర్ వెల్లడించారు. సరైన ప్రమాణాలతో సన్నవడ్లు విక్రయించి రైతులు ప్రభుత్వమిచ్చే బోనస్ పొందాలని సూచించారు.

## నిర్దేశిత సమయంలో టీజీఐపాస్ అనుమతులు జారీ చేయాలి.

**కలెక్టర్ సందీప్ కుమార్ ఝ**
**బలగం టీవీ,రాజన్న సిరిసిల్ల**



రాజన్న సిరిసిల్ల జిల్లాలో త్వరగా పరిశ్రమలు స్థాపించి యువతకు ఉపాధి కల్పించేందుకు టిజిఐపాస్ కింద వచ్చిన దరఖాస్తులను నిర్దేశిత సమయంలో జారీ చేయాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ సంభందిత అధికారులను ఆదేశించారు.శనివారం సమీకృత జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలోని కలెక్టర్ సందీప్ కుమార్ ఝ జిల్లా పరిశ్రమల ప్రోత్సాహక కమిటీ సమావేశం నిర్వహించి పరిశ్రమల స్థాపన, టి.ఎస్.ఐ పాస్, టి – ప్రైడ్ పై సంభందిత అధికారులతో సమీక్షించారు.ఈ సందర్భంగా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ మాట్లాడుతూ జిల్లాలో టీజి ఐపాస్ విధానం అమలవుతున్న తీరును ఆరా తీశారు. జిల్లాలో పరిశ్రమల అనుమతుల దరఖాస్తులను సకాలంలో జారీ చేయాలని అధికారులకు స్పష్టం చేశారు. జిల్లాలో నూతన పరిశ్రమల స్థాపనకు సంబంధించి వచ్చిన 27 ప్రతిపాదనలలో 21 ప్రతిపాదనలకు వివిధ శాఖల వారు జారీ చేసిన అనుమతులను సమీక్షించారు. పెండింగ్ లో ఉన్న 6 ప్రతిపాదనలు సైతం తక్షణమే సమీక్షించి వెంటనే అనుమతులు జారీ చేయాలని , జారీ చేసిన అనుమతులు ఆన్ లైన్ లో ప్రతిభంబించేలా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లాలో టీ – ప్రైడ్ పథకం క్రింద మంజూరు చేసిన 42 యూనిట్లు ఫైల్స్ సంపూర్ణ వివరాలు అందించాలని అన్నారు. టీ ప్రేడ్ క్రింద అందించిన ట్రాక్టర్లను గతంలో అక్రమ ఇసుక రవాణాకు వాడుతున్నారని, భవిష్యత్తులో ఇటువంటివి జరగకుండా చూడాలని అన్నారు. పోలీస్ అధికారులతో సమన్వయం చేసుకుంటూ అక్రమ ఇసుక రవాణా కేసులు ఏ ట్రాక్టర్ల పైన ఉన్నాయ్, వాటికి ట్రీ ప్రైడ్ కింద ఏదైనా సబ్సిడీ ప్రతిపాదన చేశామా పరిశీలించి నివేదిక అందించాలని అన్నారు. ఈ సమావేశంలో జి.ఎం. పరిశ్రమల శాఖ టి.హన్మంత రావు, టిజిఐఐసి జోనల్ మేనేజర్ మహేశ్వర్, ట్రాన్స్పోర్ట్ అధికారి లక్ష్మణ్, ఈడి ఎస్సీ కార్పొరేషన్ డి.స్వప్న, ఇతర శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.




## రైతులు అధైర్య పడవద్దు

**బలగం టీవీ, ఎల్లారెడ్డిపేట**

రైతులు వర్షాల మూలంగా అధైర్యం చెందవద్దని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు దొమ్మాటి నర్సయ్య అన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం హరిదాస్ నగర్ పధిర రాగట్లపల్లి గ్రామాలలో జై భీమ్ జై బాబు జై సమ్మిదాన్ పాదయాత్రను నిర్వహించారు. హరిదాస్ నగర్ గ్రామంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి పాదయాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా నర్సయ్య మాట్లాడుతూ రైతులు వర్షాల మూలంగా ఇబ్బంది ఎదుర్కొంటే ప్రభుత్వం వారికి అండగా ఉంటుందని అన్నారు.ధాన్యం తడిసిన సరే కొనుగోలు చేసే బాధ్యత తమదేనని అన్నారు. రైస్ మిల్లర్ల ద్వారా ఎలాంటి ఇబ్బంది కలిగిన తమ దృష్టికి తీసుకురావాలని రైతులకు పిలుపునిచ్చారు.వచ్చే వరి పంటకు ప్రతి గ్రామంలో వడ్లను తడవకుండా గోదాములను నిర్మిస్తామని హామీ ఇచ్చారు. ఇప్పటికే చాలా గ్రామాలలో సహకార సొసైటీ ఐకెపీల ద్వారా గోదాములు ఉన్నాయని వాటికి తోడు ప్రతి గ్రామంలో గోదాములను నిర్మిస్తామన్నారు. ఇప్పటికే రైతులకు రెండు లక్షల రూపాయల రుణమాఫీ చేశామని రైతు భరోసాను కూడా రైతులకు అందించామన్నారు. సన్నవడ్లకు 500 రూపాయల బోనస్ ను కూడా రైతులకు ఇస్తున్నామన్నారు.ఐకెపి కేంద్రాల ద్వారా వడ్లను తూకం వేసిన వెంటనే మూడు రోజులలో రైతుల ఖాతాలలో డబ్బులు జమ చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సద్ది లక్ష్మారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు షేక్ గౌస్, డైరెక్టర్లు మెండె శ్రీనివాస్, గొల్లపల్లి లక్ష్మారెడ్డి,చెట్పల్లి బాలయ్య, పొన్నాల తిరుపతిరెడ్డి,సూడిద రాజేందర్,నాయకులు గంట బుచ్చగౌడ్, వంగ మల్లారెడ్డి, చిరం నాగరాజ్, పరుశురాములు, గంగయ్య, మూర్తి వెంకటేష్, చెరుకు ఎల్లయ్య, శ్రీకాంత్ రెడ్డి, సిరిపురం నరేందర్, బండారి బాలయ్య,నంది కిషన్, పడగల రవీందర్, చెన్ని బాబు,జంగ అంజిరెడ్డి, రమేష్ ,చంద్రయ్య పాల్గొన్నారు.

## సీఎం, ఎమ్మెల్యే చిత్ర పటాలు అందజేత

**బలగం టీవీ, బోయినిపల్లి**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం తడగొండ గ్రామపంచాయతీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, చొప్పదండి శాసనసభ్యులు మేడిపల్లి సత్యంల చిత్రపటాలను గ్రామ కార్యదర్శికి శనివారం కాంగ్రెస్ నాయకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఎంసి డైరెక్టర్ గుడి రాజశేఖర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు సింగరి కేశవరెడ్డి, మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్ గౌడ్, అధికార ప్రతినిధి మహమ్మద్ హుస్సేన్, మండల శ్రీనివాస్, నరేశ్, రఫీ, భుమేష్, వివేక్, యూత్ కాంగ్రెస్ నాయకులు ఉయ్యాల నవీన్, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.





## ఘనంగా హనుమాన్ ఆలయ వార్షికోత్సవం

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని కిషన్ దాస్ పేటలోని చిన్న బడి సమీపంలో కొలువై ఉన్న భక్త ఆంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, వారి ఆశీస్సులు పొందారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఈ వార్షికోత్సవం సందర్భంగా కిషన్ దాస్ పేట పరిసర ప్రాంతాలు భక్తిమయ వాతావరణంతో నిండిపోయాయి. ఈ వేడుకల్లో మాజీ జెడ్పిటిసి చీటీ లక్ష్మణ్ రావు, సింగిల్ విండో అధ్యక్షులు గుండారపు కృష్ణారెడ్డి, సెస్ డైరెక్టర్ వరుస కృష్ణ హరి, ప్రముఖ నాయకులు ఎనగందుల నర్సింలు పాల్గొన్నారు.

# పంజాబ్, కోల్‌కతా మ్యాచ్ రద్దు..!

- రెండో ఇన్నింగ్స్‌కు వర్షం అడ్డంకి
- రెండు జట్లకు చెరో పాయింట్
- మొదటి ఇన్నింగ్స్‌లో 201 పరుగుల భారీ స్కోరు చేసిన పంజాబ్ కింగ్స్



**బలగం టీవీ, హైదరాబాద్**

పంజాబ్, కోల్‌కతా నైట్ రైడర్స్ మధ్య జరిగిన మ్యాచ్ వర్షం కారణంగా రద్దయింది. ముందుగా బ్యాటింగ్ చేసిన పంజాబ్ జట్టు 20 ఓవర్లలో 201 పరుగులు సాధించింది. అనంతరం లక్ష్యఛేధన ప్రారంభించిన కోల్ కతా జట్టు, తొలి ఓవర్‌లో 7 పరుగులు చేయగానే వర్షం ప్రారంభమైంది. వర్షం కొనసాగడంతో



మ్యాచ్ కొనసాగించడం సాధ్యపడలేదు. చివరకు అంపైర్లు మ్యాచ్‌ను రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. ఫలితంగా, ఇరు జట్లకు చెరో ఒక పాయింట్ కేటాయించబడింది.

టాస్ గెలిచిన పంజాబ్‌కు ఓపెనర్లు శుభారంభం ఇచ్చారు. ఓపెనర్లు ప్రియాంశ్ ఆర్య (35 బంతుల్లో 8 ఫోర్లు, 4 సిక్సుల సాయంతో 69 పరుగులు), ప్రభ్ సిమ్రన్ సింగ్ (49 బంతుల్లో 6 ఫోర్లు, 6 సిక్సుల సాయంతో 83 రన్స్) అటాకింగ్ షాట్లు ఆడారు. ఇద్దరు కలిసి తొలి వికెట్ కు 120 పరుగులు భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. అయితే వీరిద్దరిని ఆండ్రూ రస్సెల్ విడగొట్టాడు. ప్రియాంశ్ ఆర్యను పెవిలియన్ పంపాడు. అలానే సెంచరీకు దగ్గరగా వచ్చిన ప్రభ్‌సిమ్రన్‌ను వైభవ్ అరోరా ఔట్ చేశాడు. ఆ తర్వాత గ్లెన్ మ్యాక్స్ వెల్ (7) మళ్లీ నిరాశపరిచాడు. కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ (25 నాటౌట్), మార్కో జాన్సన్ (3), జోస్ ఇంగ్లీష్ (11) పరుగులు చేశారు.కేకేఆర్ డెత్ ఓవర్లు బాగా వేసింది. లాస్ట్ రెండు ఓవర్లు యండ్రూ రసెల్ మంచిగా వేశాడు. తక్కువ పరుగులే ఇచ్చాడు. వైభవ్ అరోరా 2 వికెట్లు తీయగా, వరుణ్ చక్రవర్తి, యాండ్రూ రసెల్ తలో వికెట్ దక్కించుకున్నారు.



# జూనియర్ బాక్సింగ్ ఛాంపియన్‌షిప్‌లో భారత్ జోరు


**బలగం టీవీ, హైదరాబాద్**

జూనియర్ బాక్సింగ్ ఛాంపియన్‌షిప్‌లో భారత బాక్సర్లు జోరు చూపిస్తున్నారు. ఇప్పటికే 39 పతకాలు ఖరారు కాగా శనివారం మరో నలుగురు సెమీ ఫైనల్‌కు దూసుకెళ్లారు. దాంతో, ఈసారి దాదాపు 43 పతకాలు భారత బాక్సర్ల ఖాతాలో చేరనున్నాయి. జోర్డాన్ వేదికగా ఆసియా బాక్సింగ్ సమాఖ్య నిర్వహిస్తున్న అండర్ –15, అండర్ –17 బాక్సింగ్ ఛాంపియన్‌షిప్‌లో భారత కుర్రాళ్లు, అమ్మాయిలు తమ పంచ్ పవర్ చూపిస్తున్నారు. అండర్ –17 పురుషుల విభాగంలో అమన్ సివచ్ (63 కిలోలు), దేవాన్ష్ (80 కిలోలు) తమ తడాఖా చూపించారు. ఐదో రోజు జరిగిన క్వార్టర్ ఫైనల్లో ఫిలీప్పిన్స్, జోర్డాన్‌కు చెందిన ఆటగాళ్లను మట్టికరిపించారు. మహిళల 60 కిలోల విభాగంలో సిమ్రన్‌జీత్ కౌర్ పంచ్‌కు జోర్డాన్ బాక్సర్ అయా అల్హసనత్ చేతులెత్తేసింది. కనీస పోరాటం చేయకుండానే 5–0తో చిత్తుగా ఓడిపోయింది. ఇక 70 కిలోల ఫైట్‌లో హిమాన్షు పాలస్తీనా బాక్సర్ చేతిలో పోరాడి ఓడిపోయింది.

# నాగచైతన్య కొత్త మూవీ స్పెషల్ వీడియో

**బలగం టీవీ, హైదరాబాద్**

అక్కినేని నాగచైతన్య ప్రస్తుతం విరూపాక్ష ఫేం కార్తీక్ దండు దర్శకత్వంలో ఓ సినిమా చేస్తున్నారు. ఈ సినిమా మైథలాజికల్ థ్రిల్లర్ గా ఉండనుంది. ఇది చైతూకు 24వ మూవీ (ఎన్‌సీ24). ఇప్పటివరకు తెలుగు తెరపై చూడని సరికొత్త మైథలాజికల్ థ్రిల్లర్ కథాంశంతో దర్శకుడు దీన్ని తీర్చిదిద్దుతున్నట్లు తెలుస్తోంది. ఇక, ఇప్పటికే విడుదలైన మూవీ ప్రీలుక్ పోస్టర్ ఆకట్టుకుంది. తాజాగా ఈ చిత్రానికి సంబంధించిన ఓ స్పెషల్ వీడియోను మేకర్స్ విడుదల చేశారు. ఇందులో ఈ సినిమా కోసం వేసిన ప్రత్యేక సెట్స్, నాగచైతన్య లుక్, ఇతర విషయాలను చూపించారు. ఆసక్తికర ఎలిమెంట్స్‌తో తీర్చిదిద్దిన వీడియో సినిమాపై అంచనాలను పెంచింది. అజనీష్ లోక్‌నాథ్ సంగీతం అందిస్తున్న ఈ మూవీని శ్రీ




వెంకటేశ్వర సినీ చిత్ర, సుకుమార్ రైటింగ్స్ బ్యానర్లు సంయుక్తంగా నిర్మిస్తున్నాయి.



# 'కాంత' నుంచి సముద్రఖని ఫస్ట్ లుక్ రిలీజ్

**బలగం టీవీ, హైదరాబాద్**

దుల్కర్ సల్మాన్ మోస్ట్ ఎవైటెడ్ పీరియాడికల్ మూవీ 'కాంత'. లీడ్ పెయిర్ దుల్కర్ సల్మాన్, భాగ్యశ్రీ బోర్సేల స్టన్నింగ్ ఫస్ట్ లుక్ పోస్టర్లను రిలీజ్ చేసిన తర్వాత మేకర్స్ ఇప్పుడు ఈ చిత్రం నుండి మరొక ముఖ్యమైన పాత్రను పరిచయం చేశారు. వెరీ ట్యాలెంటెడ్ సముద్రఖని పుట్టినరోజును పురస్కరించుకుని, టీం అతని ఇంటెన్స్ ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేసింది. అద్భుతమైన మోనోక్రోమ్ ప్యాలెట్‌లో ప్రజెంట్ చేసి ఈ పోస్టర్‌లో సముద్రఖని ఫెరోషియస్ అవతార్‌లో కనిపించారు. ఈ పోస్టర్ ఇది సినిమా కాల నేపథ్యాన్ని అద్భుతంగా చూపింది. అతని ఇంటెన్స్ ఎక్స్ప్రెషన్ తో స్టైలింగ్, అతని పాత్ర కథనంలోపవర్ ఫుల్ గా ఉంటుందని సూచిస్తుంది. ఈ సినిమా షూటింగ్ పూర్తయింది. పోస్ట్–ప్రొడక్షన్ పనులు చివరి దశలో వున్నాయి. సినిమా విడుదల తేదీ త్వరలో అనౌన్స్ చేయనున్నారు.



# పహల్గామ్ ఉగ్రదాడి హిందూ ముస్లిం గొడవ కాదు

**బలగం టీవీ, హైదరాబాద్**

జమ్ము కశ్మీర్ పహల్గాం ఉగ్రదాడి జరిగిన తర్వాత సోషల్ మీడియాలో రెండు వర్గాలుగా విడిపోయి.. గొడవలు పెట్టుకుంటున్నారు. తాజాగా ఈ వివాదంపై స్పందించింది నటి కాజల్ అగర్వాల్. పహల్గామ్‌లో జరిగిన ఉగ్రదాడి హిందూ వర్సెస్ ముస్లిం గొడవ కాదని, విద్వేషాలు రెచ్చగొట్టేవారు కోరుకునేది కూడా అదేనని నటి కాజల్ అగర్వాల్ అన్నారు. ఇది ఉగ్రవాదం వర్సెస్ మానవత్వం అని ఆమె స్పష్టం చేశారు. భారతీయులను ఒక ప్రత్యేకమైన వర్గం పేరుతో వేరు చేయవద్దని ఆమె తన సోషల్ మీడియా వేదికగా విజ్ఞప్తి చేశారు. వేర్పాటు భావం భయాన్ని పెంచుతుందని, మరింత వ్యతిరేక భావాలకు దారితీస్తుందని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. "మనమంతా ఒకే చైతన్యం, ఒకే జాతి" అని కాజల్ అగర్వాల్ తన పోస్ట్‌లో పేర్కొన్నారు.

# పెళ్లి పత్రికలపై మహేష్ బాబు ఫోటో


**బలగం టీవీ, హైదరాబాద్**



నటుడు మహేష్ బాబు ప్రస్తుతం రాజమౌళి దర్శకత్వంలో సినిమా చేస్తున్న విషయం తెలిసిందే. ఈ సినిమా షూటింగ్ పనులు శర వేగంగా జరుగుతున్నాయి. ఇప్పటికే రెండు షెడ్యూల్ చిత్రీకరణ పూర్తి చేసుకున్నారు . ఇలా సినిమాల పరంగా ఎంతో బిజీగా ఉండే మహేష్ బాబు సినిమాలలో సంపాదించిన డబ్బుతో ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ముఖ్యంగా చిన్నపిల్లలకు గుండె ఆపరేషన్లను ఉచితంగా చేయిస్తూ వారికి పునర్జన్మ ఇస్తున్నారు. నిజజీవితంలో కూడా రియల్ హీరో అనిపించుకున్న మహేష్ బాబుకి విపరీతమైనటువంటి ఫ్యాన్ ఫాలోయింగ్ ఉందని చెప్పాలి. అయితే తాజాగా ఓ అభిమాని మహేష్ బాబు పట్ల తనకున్నటువంటి అభిమానాన్ని వినూత్న రీతిలో చాటుకున్నారు. మహేష్ బాబు అంటే ఎంత ఇష్టమో బయటపెట్టారు.. కర్నూలుకు చెందిన ఓ అభిమాని తన పెళ్లి కావడంతో పెళ్లి ఆహ్వానం కోసం పెళ్లి పత్రికలను ముద్ర వేయించారు. సాధారణంగా పెళ్లి పత్రికలపై దేవుళ్ళ ఫోటోలను వేస్తారు కానీ ఈ అభిమాని మాత్రం దేవుడి ఫోటోతో పాటు మహేష్ బాబు ఫోటోలు కూడా ముద్ర వేయించారు. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన ఫోటోలు సామాజిక మాధ్యమాల్లో వైరలవుతుండగా, దీనిపై నెటిజన్స్ క్రేజీ కామెంట్స్ చేస్తున్నారు.

# శర్వానంద్‌కు జోడీగా అనుపమ పరమేశ్వరన్

**బలగం టీవీ, హైదరాబాద్**




టాలీవుడ్ నటుడు శర్వానంద్ తన కెరీర్‌లో తొలి పాన్ ఇండియా చిత్రం చేయబోతున్న విషయం తెలిసిందే. సంపత్ నంది ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నాడు. 1960ల చివర్లో ఉత్తర తెలంగాణ, మహారాష్ట్ర సరిహద్దుల్లో జరిగిన కథ ఆధారంగా ఈ సినిమా రాబోతుంది. ఇక ఈ సినిమా నుంచి మేకర్స్ తాజాగా ఓ సాలిడ్ అప్డేట్ రివీల్ చేశారు. ఈ సినిమాలో అందాల భామ అనుపమ పరమేశ్వరన్ హీరోయిన్‌గా నటిస్తున్నట్లు వారు అనౌన్స్ చేశారు. ఆమెకు సంబంధించి ఓ ప్రీ–లుక్ పోస్టర్ కూడా వారు రిలీజ్ చేశారు. ఈ సినిమాకు భీమ్స్ సిసిరోలియో సంగీతం అందిస్తున్నాడు. ఈ సినిమాను ప్రముఖ నిర్మాత కె.కె.రాధామోహన్ శ్రీ సత్యసాయి ఆర్ట్స్ బ్యానర్‌పై ప్రొడ్యూస్ చేస్తున్నారు



**ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పిఠాపురం నియోజవర్గం పర్యటన సందర్భంగా ఈవో సుబ్బారావు అక్కడికి వెళ్లి మేన అన్నవరం ఈ వీర వెంకట సత్యనారాయణ స్వామివారికి వచ్చే నెలలో జరిగే వార్షిక దివ్య కల్యాణ మహోత్సవం ఉన్నదని ఆ ఉత్సవానికి రావాలని ఆహ్వానించారు. పవన్‌కు శుభలేఖ అందించారు.**